


## ..వేగంగా రోడ్ల విస్తరణ

పత్తికొండ ప్రధాన రోడ్ల విస్తరణ పనులు వేగంగా పూర్తిచేస్తామని కలెక్టర్ సృజన తెలిపారు. బుధ వారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి ఆమె పట్టణంలో పర్యటించారు.

..8లో



## రూ.35 కోట్లతో..

శ్రీశైల ప్రధానాలయానికి తూర్పుభాగంలో రూ. 35 కోట్లతో సాలుమండపాల నిర్మాణం చేప ట్టనున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షు డు రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు.

..8లో

## ద్వాదశి వేడుకలు



మంత్రాలయం : శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ద్వాదశి వేడుకలను బుధవా రం వైభవంగా నిర్వ హించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

## న్యూస్‌రీల్

### రైతు భరోసా దరఖాస్తుకు నేటితో గడువు ముగింపు

నంద్యాల సెంట్రల్: వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకునేం దుకు గురువారంతో గడువు ముగుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారు ఏవైనా ఫిర్యాదులు ఉంటే గురువారం రైతు భరోసా కేంద్రాల్లో తెలి యజేయాలని పేర్కొన్నారు. కొత్తగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునే వారు సైతం ఆర్‌బీకేలను సంప్రదించాలని సూచించారు.

### రూ.13లక్షల బంగారు పళ్లెం విరాళం



దాతలకు స్వామి అమ్మవార్ల లడ్డూప్రసాదాలను అందజేస్తున్న చైర్మన్, ఈఓ



విరాళంగా ఇచ్చిన బంగారు పళ్లెం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానానికి బుధవారం గుంటూరుకు చెందిన ఎం.నాగప్రసాద్ బంగారు పళ్లెం విరాళంగా అందజేశారు. కార్యాలయ సమావేశ మందిరంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్నకు ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో దాతలు ఈ పళ్లెం అందించారు. దాతలు మాట్లాడుతూ 245 గ్రాముల బరువు గల పళ్లెం విలువ సుమారు రూ.13.36లక్షలు ఉంటుందని, దీనిని స్వామిఅమ్మవార్ల పూజా కైంకర్యాలలో వినియోగించాలని కోరారు. అనంతరం దాతలకు శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను దేవస్థానం తరపున అందజేశారు.

### కొనసాగుతున్న భగభగలు

కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. వారం రోజుల నుంచి ఉదయం 10 గంటలకే ఎండ మండిపోతోంది. సాయంత్రం 7 గంటల సమయంలో కూడా వడగాలుల తీవ్రత తగ్గడం లేదు. మామూలుగా అయితే ఈ సమయంలో 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయి. కాని ఈ ఏడాది 45 డిగ్రీలు దాటుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కర్నూలు జిల్లా ఆలూరులో 43.23 డిగ్రీలు, ఒంటి గంటకు ఆలూరులోనే 44.04 డిగ్రీలు, రెండు గంటలకు 44.81 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లాలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో చాగలమర్రిలో 44.05, ఒంటి గంట సమయంలో 45.12 డిగ్రీలు, 2 గంటల సమయంలో 44.65 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రత నమోదైంది. మరో రెండు, మూడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లుగా విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

# టీడీపీలో ముసలం

- నంద్యాల నియోజకవర్గంలో రచ్చకెక్కిన వర్గపోరు
- యువగళం పాదయాత్ర సాక్షిగా విభేదాలు బట్టబయలు
- ఏవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి అఖిల ప్రియ వర్గీయుల దాడి
- నంద్యాల అసెంబ్లీ టికెట్ కోసం నలుగురు నేతల యత్నాలు
- ఆధిపత్యం కోసం ఎవరికి వారే కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైనం

ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో వర్గపోరు రచ్చకెక్కింది. నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సాక్షిగా విభేదాలు బహిర్గతమయ్యాయి. నంద్యాల నియోజకవర్గంలో నలుగురు నేతలు ఆధిపత్యం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రూపులుగా విడిపోయి వ్యూహాలు, ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో పార్టీలో పట్టుకోసం యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి అఖిలప్రియ వర్గీయులు దాడి చేయడం చర్చనీయాశమైంది. టీడీపీలో ముసలం రేపింది.



భూమా అఖిలప్రియ



ఏవీ సుబ్బారెడ్డి



ఎన్ఎండీ ఫరూక్



భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల: టీడీపీ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి, మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, దివంగత భూమా నాగిరెడ్డి తనయుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. టికెట్ ప్రయత్నంలో భాగంగా నాయకులు నంద్యాలలో నాలుగు గ్రూపులుగా విడిపోయి రాజకీయం చేస్తున్నారు. వీరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. యువగళం పాదయాత్రలో భాగంగా నంద్యాల నియోజకవర్గంలోకి ప్రవేశించిన లోకేష్ కు నలుగురు నాయకులు తమ వర్గీయులతో వేర్వేరుగా స్వాగతం పలికారు. ఈ కోవలోనే మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, వారి అనుచరులు సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఏవీ సుబ్బారెడ్డిని కిందకు తోసి, చొక్కా చింపి దంతాలు ఊడే విధంగా కొట్టారు. ఈ ఘటనతో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. టీడీపీకి నియోజకవర్గంలో అంతంత మాత్రమే బలం ఉంది. గ్రూపు తగాదాలతో కార్యకర్తల్లో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. యువగళం పాదయాత్రలో నారాలోకేష్ ముందే టీడీపీ నాయకులు దాడి చేసుకోవడం టీడీపీ కార్యకర్తలు భయాందోళనకు గురవుతున్నారు.

**భూమా అఖిలప్రియకు రిమాండ్..**

సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు భూమా అఖిలప్రియతో పాటు ఆమె భర్త భార్గవరామ్, పీఏ మోహన్, శక్తి వెంకటసాయినాథ్‌లు లతో పాటు మరో 8 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం ఆళ్లగడ్డలోని భూమా అఖిలప్రియ ఇంటికి చేరుకున్నారు. అఖిలప్రియతో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం పాణ్యం పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం భూమా అఖిలప్రియను నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నంద్యాల జిల్లా కోర్టులో పోలీసులు హాజరు పరిచారు. నంద్యాల మెజిస్ట్రేట్ అఖిలప్రియ, భార్గవరామ్, మోహన్, సాయినాథ్‌లకు 14రోజుల పాటు రిమాండ్ విధించారు. అఖిలప్రియను కర్నూలు మహిళా సబ్‌జైలుకు , మిగిలిన వారిని కర్నూలు సబ్‌జైలుకు తరలించారు. ఈ కేసులో మరో ఏడుగురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.



**లోకేష్ పాదయాత్రలో ఎవరికి వారే బ్యానర్లు..**

యువగళం పాదయాత్రలో లోకేష్‌కు స్వాగతం పలికేందుకు నంద్యాల పట్టణంలో టీడీపీ నాయకులు ఎవరికి వారు బ్యానర్లు వేయించుకున్నారు. భూమా బ్రహ్మానందరెడ్డి, ఫరూక్, ఏవీ సుబ్బారెడ్డి, భూమా అఖిలప్రియ మద్దతు దారులు వేర్వేరుగా తమ అనుచరులతో బ్యానర్లు కట్టారు. ఈ బ్యానర్లు చూసిన నంద్యాల ప్రజలు పట్టణంలో టీడీపీ నాయకులు అధికమయ్యారని నవ్వుకుంటున్నారు.

**ఆధిపత్యం కోసమే ఏవీపై దాడి..**

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశిస్తే నంద్యాల లేదంటే ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఏవీ సుబ్బారెడ్డి తరచూ ప్రకటనలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధిపత్యం కోసమే ఏవీ సుబ్బారెడ్డిపై దాడి జరిగిందని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. 2019 ఎన్నికల ముందు శిరివెళ్ల మండలంలో సైకిల్ యాత్ర చేస్తున్న ఏవీ సుబ్బారెడ్డి సైతం రాళ్ల దాడి చేయించారు. అనంతరం ఏవీ సుబ్బారెడ్డిని హత్య చేసేందుకు కిరాయి హంతకులతో కుట్ర పన్నిన విషయాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. అప్పటి నుంచి వీరి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. యువగళం పాదయాత్రలో ఏవీ సుబ్బారెడ్డిపై మరో సారి దాడి చేయడంతో వీరి మధ్య విభేదాలు ఎక్కడికి వెళ్తాయోనని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

### సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు ఆరోపణలు

ప్రతి ఏడాది జరిగే ఎన్‌టీ రామారావు జయంతి, వర్ధంతి వేడుకల్లో సైతం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఫరూక్‌లు వేర్వేరుగా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. సోషల్ మీడియాలో సైతం ఎవరి వర్గం వారు టికెట్ మాకేనంటూ పోస్టులు పెట్టుకోవడంతో పాటు సొంత నాయకులపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి మధ్య ఏడాది కాలంగా విభేదాలు భగ్గుమంటున్నాయి. భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డికి నంద్యాల టికెట్ ఇప్పించాలనే ప్రయత్నంతో నంద్యాలలో అఖిలప్రియ సొంత కార్యాలయం కూడా ఏర్పాటు చేశారు. భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించడం అప్పట్లో చర్చనీయాశమైంది. భూమా అఖిలప్రియ, భూమా బ్రహ్మానందరెడ్డి.. ఏడాదిన్నర కాలంగా ఒక్క కార్యక్రమంలో కూడా కలిసి పాల్గొనలేదు. టికెట్ మాకంటే మాకు అంటూ అనుచరులకు చెప్పుకుంటున్నారు. దీంతో టీడీపీ నాయకులు ఎవరి వైపు వెళ్లాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ నాయకుడికి టికెట్ ఇచ్చినా మిగిలిన ముగ్గురు మద్దతు ఇచ్చే ప్రసక్తే కనిపించనంతగా విభేదాలు నెలకొన్నాయి.

## ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఏడాది గడవకముందే మరోసారి ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని మే 22 నుంచి 31వ తేదీల మధ్య ఎత్తివేస్తూ బుధవారం ప్రభుత్వం జీఓ ఎంఎస్ 71ను విడుదల చేసింది. ఒక ఉద్యోగి ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తే ఉంటే అతనికి తప్పనిసరిగా బదిలీ ఉంటుంది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి రిక్వెస్టు బదిలీ చేస్తారు. 2023 ఏప్రిల్ 30వ తేదీనాటికీ ఉద్యోగుల సర్వీసును లెక్కలోకి తీసుకుంటారు. ఉద్యోగసంఘాల నేతలకు బదిలీ మినహాయింపు ఒకస్థానంలో 9 ఏళ్లకు పెంచారు. అంతకంటే ఎక్కువ ఏళ్లు పనిచేస్తుంటే బదిలీ చేస్తారు. ఈ బదిలీలు పాత 13 జిల్లాల ప్రాతిపదికన చేస్తారు. ఉపాధ్యాయులకు సంబంధించి త్వరలోనే వేరుగా బదిలీల జీఓను ఇస్తారు. కాగా, సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం ఏమీ చెప్పలేదు. వారికి వేరుగా బదిలీల జీఓ ఇవ్వాల్సి ఉంటుంది. బదిలీలపై 2023 జూన్ 1 నుంచి మళ్లీ నిషేధం విధిస్తారు.

**వైద్యారోగ్య శాఖలో..**

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖలో పరస్పర బదిలీల కోసం ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి. కృష్ణబాబు మార్గదర్శకాలను జారీ చేశారు. ఇందులో స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులతో పాటు గ్రేడ్–2 ల్యాబ్‌టెక్నీషియన్, గ్రేడ్–2 ఫార్మాసిస్టు, ఎంపీహెచ్‌ఎస్(మేల్), ఎంపీహెచ్‌ఎస్(ఫిమేల్), ఎంపీహెచ్‌ఈవో, పీహెచ్‌ఎన్(ఎన్‌టి), సీహెచ్‌వో(మేల్), సీహెచ్‌వో(ఫిమేల్), హెల్త్ ఎడ్యుకేటర్ కేటగిరిలు ఉన్నాయి. ఉద్యోగులు ఈ ప్రక్రియను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు.

## జూలై 1 వరకు ఉచితంగా ఆధార్ అప్‌డేషన్

కర్నూలు(సెంట్రల్): ఆధార్‌లో మార్పులు, చేర్పులను ప్రజలు జూలై 1వ తేదీ వరకు ఉచితంగా చేయించుకోవచ్చని ఆధార్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ జావీదు తెలిపారు. గడువు దాటిన తరువాత ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం కర్నూలులోని ఎన్ఐసీ వీసీ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ అప్‌డేషన్ క్యాంపులను విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. పుట్టిన బిడ్డకు కూడా ఆసుపత్రిలోనే ఆధార్ నంబర్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

- నాలుగేళ్లలో 2.19లక్షల ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం
- పగలే కోతల్లేకుండా 9గంటల విద్యుత్ సరఫరా
- దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు వెల్లడి





సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు, హాజరైన విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(రాజ్‌విహార్): వ్యవసాయ విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు స్పష్టం చేశారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఆయన కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యుత్ అధికారులతో డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లా పురోగతిని అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పేదలు, రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ లక్ష్యాలను సాధిస్తున్నట్లు చెప్పారు. గత నాలుగేళ్లలో తమ సంస్థ పరిధిలోని కర్నూలు, వైఎస్ఆర్ కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాలో 2.19లక్షల మంది రైతులకు ఉచిత కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు స్తంభాలు, ఇతర సామగ్రికి కొదువ లేదని, వారి అవసరాల మేరకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నవరత్న పథకాలు అమలు చేస్తున్న తరహాలో తమ సంస్థలోనూ నవరత్నాల(తొమ్మిది పథకాలు) అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, వాటికి కావాల్సిన నిధులకు, సామగ్రికి కొరత లేకుండా సరఫరా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కర్నూలు సర్కిల్ ఓవరాల్‌గా అన్ని జిల్లాల కంటే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే ఉత్సాహంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి, సీజీఎంలు కె.గురువయ్య, కె.ఆర్.ఎస్ ధర్మజ్ఞాని, కె. విజయకుమార్‌రెడ్డి, కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, ఇతర ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

### రైతులకు అదనపు ఖర్చు లేకుండా విద్యుత్ కనెక్షన్

వ్యవసాయ అవసరాల కోసం రైతులకు ఎలాంటి అదనపు ఖర్చులు లేకుండా విద్యుత్ కనెక్షన్ అందించాలని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఆదేశించారు. కనెక్షన్ మంజూరైన సమాచారం అన్నదాతలకు అందించాలని, ఇందుకోసం ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే ఏఈ, ఏడీఈ, ఈఈలకు ఫిర్యాదు చేయాలన్నారు. డీడీలు చెల్లించిన రైతులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగనన్న కాలనీలతో పాటు జలకళ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎస్ఈ మొదలు కింది స్థాయి సిబ్బంది తప్పని సరిగా పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణ ప్రాంతాల్లో 24గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48గంటల్లోపు కొత్తది అమర్చాలన్నారు. విద్యుత్ బిల్లులను 100శాతం వసూలు చేయాలన్నారు.

# బోగస్ హాజరుతో బొక్కేశారు!

- ఉపాధి హామీ పథకంలో అక్రమాలు
- టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై అవినీతి ఆరోపణలు
- నామమాత్రపు తనిఖీలు చేస్తున్న అధికారులు
- పక్కదారి పట్టినప్రభుత్వ లక్ష్యం





ఎన్. ఘణపురంలో పనులు చేయకుండా పంట కాలువలకు గడ్డి కోసిన దృశ్యం, చెట్ల కింద సేద తీరుతున్న కూలీలు

పగిడ్యాల: వలసలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరమైంది. మేట్‌లు బోగస్ హాజరుకు పాల్పడుతూ ఉపాధి నిధులను స్వాహా చేస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. గ్రామంలో లేని వారి పేర్లు మస్టర్‌లో నమోదు చేసి ఉపాధి నిధులను కొల్లగొడుతున్నారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఎంబీబీఎస్, పీజీ కోర్సులు చేస్తున్న వారి పేరు మీద వేతనాల స్లిప్‌లు రావడం చూసి గ్రామస్తులు విస్మయానికి గురవుతున్నారు. పగిడ్యాల మండలం ఎన్. ఘణపురంలో ఉపాధి హామీ పథకం పనుల్లో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు చేస్తున్న అక్రమాలను అధికారులు అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**పనిచేయకుండా హాజరు**

పగిడ్యాల మండలంలో 9,182 జాబ్‌కార్డులు ఉండగా రోజుకు 2,700 మంది కూలీలు పనులకు వెళ్తున్నట్లు రికార్డుల్లో నమోదవుతోంది. అయితే ఎం.ఎస్. ఘణపురం గ్రామంలో కొందరు కూలీలు ఉదయం పని ప్రదేశానికి చేరుకుని మొదటి ఫొటోను అప్‌లోడ్ చేసి ఇంటికి చేరుకుంటున్నారు. పని చేయకుండా మళ్లీ 11 గంటల ప్రాంతంలో ఫొటో అప్‌లోడ్ చేసేందుకు వెళ్లడం పరిపాటిగా మారింది. ఒక్కొక్క కూలీకి సరాసరి సగటున రూ. 237 దినసరి వేతనం చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా వారానికి రూ. 23 లక్షల ఉపాధి వేతనం కూలీల ఖాతాల్లోకి జమ అవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నెల రోజులకే రూ. 1.03 కోట్లు నిధులను ప్రభుత్వం కూలీలకు చెల్లించినట్లు ఏపీఓ మద్దిలేటి తెలిపారు.

**జాబ్‌కార్డుదారులకు తెలియకుండా..**

ఫీల్డ్‌అసిస్టెంట్లు జాబ్‌కార్డుదారులకు తెలియకుండా బోగస్ హాజరు వేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా యాప్‌లో వేరొకరి ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి తనిఖీలకు వచ్చే అధికారులకు ఈ విషయం తెలియడం లేదు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది చేసే అక్రమాలు వెలుగులోకి రావడం లేదు. సామాజిక తనిఖీ బృందం కూడా డబ్బుకు దాసోహమై అవినీతిని నిర్ధారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పేద కూలీల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తుంటే, ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాల కారణంగా ఆ నిధులు పక్కదారి పడుతున్నాయి.

**అక్రమాలు ఇవీ..**

- ఎన్. ఘణపురం అంగన్‌వాడీ కేంద్రంలో షేక్ మౌలాబి ఆయాగా పనిచేస్తున్నారు. ఈమే పేరు మీద మస్టర్(1471) మే ఒకటి నుంచి 6వ తేదీ వరకు పనిచేసినట్లు నమోదు చేసి రూ. 1,020 అకౌంట్‌లోకి జమ చేశారు.
- దూదేకుల షేక్షావలీ నిజామబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఇతని పేరు మీద మస్టర్(737, 1460, 1067) 9రోజులు పని చేసినట్లు నమోదు చేసి రూ. 2111.47 అకౌంట్‌లోకి జమ చేశారు.
- బోయ మంగమ్మ, బోయ పెద్దయ్య ఊర్లో లేరు. వీరి జాబ్ కార్డ్ 20023పై మస్టర్ 737లో 5 రోజులు పనిచేసినట్లు నమోదు చేసి రూ. 1,323.15 జమ చేశారు.
- నన్నూరు లక్ష్మీదేవి జాబ్‌కార్డు(20034)( మస్టర్ రోల్: 713, 1457, 1064)లో పనికి వెళ్తే ఆమె భర్త నరసింహుడు పేరు మీద హాజరు వేసి ఇద్దరు 19 రోజులు పనిచేశారని రూ. 4,364. 89 అకౌంట్‌లోకి అప్‌లోడ్ చేశారు.
- జాబ్‌కార్డ్(20046)లో ఒక్క కృష్ణవేణి పనికి వెళ్తే గంగాధర్ (లారీ డ్రైవర్), రామకృష్ణ పేర్ల మీద బోగస్ హజరు వేసి 22 పనిదినాలకు రూ. 5725 చెల్లించారు.
- ఎన్. ఘణపురం గ్రామానికి ప్రవీణ్(ఎంబీబీఎస్‌లో పీజీ చేస్తున్నాడు), రాఘవేంద్ర(సాఫ్ట్‌వేర్ ఉద్యోగి)పేర్లపై ఉపాధి వేతన స్లిప్పులు వచ్చాయి.

**అవినీతి జరుగుతోంది**



ఎం. ఘణపురం గ్రామ పంచాయతీలో జరిగే ఉపాధి పనుల్లో భారీ అవినీతి జరుగుతోంది. కూలీలు కొందరు పనులు చేయడం లేదు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఒక్కొక్క కూలీ వద్ద రూ. 50 చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. దీంతో కొందరు గ్రామస్తులు కోపోద్రేక్తులై నాపై దాడి చేశారు.

– బషీర్, ఎన్. ఘణపురం

**నేను పనికి వెళ్లలేదు**



గ్రామంలోని ఓ రైతు ఇంట్లో నేను గాసం ఉన్నాను. ఉపాధి పనులకు వెళ్లడం లేదు. ఇంట్లో నా భార్య వెళ్తోంది. నా పేరు మీద హాజరు వేసి డబ్బులు స్వాహా చేసే సంగతి తెలియదు. మస్టర్ రోల్(1483)లో రెండు రోజులు పని చేసినట్లు నమోదు చేసి అకౌంట్‌లోకి రూ. 525జమ చేసిన విషయం నాకు తెలియదు.

– ముర్తుజావలీ, ఎం. ఘణపురం

**నా దృష్టికి వచ్చింది**



కూలీలు పని చేయకుండా ఫొటోలు దిగి ఇంటికి వెళ్తున్నట్లు నా దృష్టికి కూడా వచ్చింది. నిబంధనల మేరకు పనులు చేయించాలని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించాను. కూలీల వద్ద డబ్బులు వసూలు చేసే విషయం నా దృష్టికి రాలేదు.

– మద్దిలేటి, ఏపీఓ, పగిడ్యాల

### ఆర్‌బీకేలకు బడ్జెట్ విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి సంబంధించి రైతుభరోసా కేంద్రాలకు మొదటి క్వార్టర్ బడ్జెట్ విడుదలయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 877 రైతు భరోసా కేంద్రాలు ఉండగా.. మొదటి విడతలో రూ.1,64,27,865 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా రూ.83,89,054, నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఉండగా... రూ.80,38,811 మంజూరైంది. స్టేషనరీ కోసం కర్నూలు జిల్లాకు రూ.32,368, నంద్యాల జిల్లాకు రూ.28,544, ఆర్‌బీకేల నిర్వహణకు(మెయింటెనెన్స్) కర్నూలు జిల్లాకు రూ.1,63,100, నంద్యాల జిల్లాకు రూ.1,43,850, ఇంటర్నెట్ కోసం కర్నూలు జిల్లాకు రూ.9,07,768, నంద్యాల జిల్లాకు రూ.8,00,628 ప్రకారం విడుదలయ్యాయి. ఆర్‌బీకేల అద్దె చెల్లింపునకు కర్నూలు జిల్లాకు రూ.72,85,818 మంజూరైంది. నంద్యాల జిల్లాలో ఆర్‌బీకేల అద్దెల చెల్లింపునకు రూ.70,56,785 మంజూరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## కుమార్తె మరణం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందడంతో తట్టుకోలేక ఓ తండ్రి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే..పార్లపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తం కుమార్తె కుమారి రెండు రోజుల క్రితం బోడబండ గ్రామ సమీపంలో బైక్ ఢీకొని మరణించింది. ఈ ఘటన తండ్రి పురుషోత్తంను తీవ్ర విషాదంలోకి నెట్టింది. అన్నం తినటం మానేసిన అతను ఉదయం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ దగ్గర ఉన్న తన చెరుకు రసం బండి దగ్గరకు వెళ్లి కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి పడుకున్నాడు. సాయంత్రం ఎంతకి లేవకపోటంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారు దగ్గరికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే వారు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.





## రూ.35 కోట్లతో సాలుమండపాల నిర్మాణం

- ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి



ధర్మకర్తల మండలి సమావేశంలో చైర్మన్, ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ప్రధానాలయానికి తూర్పుభాగంలో ఉన్న శివవీధుల్లో రూ. 35 కోట్లతో సాలుమండపాల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆయా పనులకు టెండర్లు పిలవడానికి సభ్యులు ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. బుధవారం శ్రీశైల దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో చైర్మన్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 35 అంశాలు చర్చించగా వీటిలో 28 అంశాలు ఆమోదించబడ్డాయి. 6 అంశాలు వాయిదా, ఒక అంశం తిరస్కరించబడింది. ముందుగా ఈ నెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాకుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికను ధర్మకర మండలి చైర్మన్, సభ్యులకు ఈఓ ఎస్.లవన్న అందజేశారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, గురుమహంత్ ఉమామహేష్, జి.నరశింహారెడ్డి, ఎం.విజయలక్ష్మి, మేరాజోత్ హనుమంత్ నాయక్, సూరిశెట్టి మాధవీలత, డా.సి.కనకదుర్గ, ఎక్స్ అఫీషియో సభ్యులు హెచ్.వీరయ్యస్వామి, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు పాల్గొన్నారు.

**సమావేశంలో అమోదం పొందిన వాటిలో ప్రధానమైనవి**

- పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్షేత్రంలో మొక్కల రక్షణ కోసం ట్రీగార్డ్స్ ఏర్పాటుకు రూ.25లక్షల అంచనాతో టెండర్ పిలవడం
- అన్నప్రసాద వితరణ భవనంపై సోలార్ కుకింగ్ సిస్టమ్ అమలుకు ఇద్దరు సాంకేతిక పరిజ్ఞానం గల అర్హులైన ఆపరేటర్లను టెండర్ ద్వారా ఏర్పాటు
- అన్నప్రసాద భవనంలోని వంటశాల, లడ్డూప్రసాదాల తయారీ కేంద్రం, క్యూ కాంప్లెక్స్, సర్వర్ రూమ్ మొదలైన చోట్ల రూ. 20 లక్షలతో అగ్నిమాపక పరికరాల ఏర్పాటుకు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది.

## ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

కర్నూలు (టౌన్): వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ వివాహిత కర్నూలు నగరంలో కోచింగ్ తీసుకుంటున్న కూతురును చూసేందుకు వచ్చి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి భర్త పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల మేరకు.. కడప పట్టణంలోని ఓంశాంతి నగర్‌కు చెందిన పులిమి జేమ్స్ ఏపీఎస్‌పీడీసీఎల్ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పులివెందులలో పనిచేస్తున్నాడు. 18 సంవత్స రాల క్రితం ఇతనికి అదే పట్టణానికి చెందిన జాయిస్ సువర్ణ కుమారి (44) తో వివాహమైంది. కుమారుడు, కూతురు సంతానం. కర్నూలు నగరంలోని ఆకాష్ ఇన్స్టిట్యూట్‌లో సీబీఎస్ఈ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కూతురు గ్లోరి ఎవాంజిలిన్‌ను చూసేందుకు ఈనెల 13న సువర్ణకుమారి వచ్చారు. ఈనెల 16 వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఉల్చాల రోడ్డులోని వసుంధర నెస్ట్ టవర్స్‌లోని ప్రశాంత్ అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా ప్రశాంత అనే ఇంట్లో ఆత్మహత్య జరగడంపై అనుమానాలున్నాయని భర్త పులిమిజేమ్స్ నాలుగోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ముగ్గురు వైద్యులకు పదోన్నతులు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ముగ్గురు గైనకాలజిస్టులకు పదోన్నతి లభించింది. ఆయా కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారికి ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు అనంతపురంలో పనిచేస్తున్న డాక్టర్ పద్మజ, నంద్యాలలో మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న డాక్టర్ స్నిగ్ధ కర్నూలుకు బదిలీ అయ్యారు. కర్నూలులోనే విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సావిత్రి పదోన్నతిపై ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు. కాగా గైనకాలజి విభాగంలో మొత్తం ఏడు యూనిట్లకు గాను ప్రస్తుతం ఆరుగురు ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు.మరో ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది.

## 27 నుంచి పిఠాపురంలో రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 27, 28 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో 8 వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, పురుషుల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ కేటగిరిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు వచ్చే నెల 17,18 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

# పత్తికొండలో వేగంగా రోడ్ల విస్తరణ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి పత్తికొండలో పర్యటన
- విస్తరణ పనులపై అధికారులతో సమీక్ష



పత్తికొండ ప్రధాన రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ పట్టణంలో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి ఆమె పట్టణంలో పర్యటించారు. ఊరివాకిలి నుంచి గుత్తిరోడ్డు టర్నింగ్ వరకు ప్రధాన రోడ్డుపై నడుచుకుంటూ ట్రాఫిక్‌ను పరిశీలించారు. పెరిగిన జనాభాతో ట్రాఫిక్ సమస్య తలెత్తి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే.. జిల్లా కలెక్టర్‌కు వివరించారు. రోడ్ల విస్తరణ ఆవశ్యకతను తెలియజేశారు. ఈ అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. రెండున్నర కిలోమీటర్ల మేర ప్రధానరోడ్డు విస్తరణ చేపడతామన్నారు. జూలై 15వ తేదీలోగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారితో మాట్లాడి స్థల సేకరణ పూర్తి చేయాలని ఆర్‌డీఓను ఆదేశించారు. ఆ తర్వాత మొత్తం కట్టడాలను తొలగించి రహదారి, విద్యుత్ సంబంధ పనులు ముమ్మరం చేస్తామన్నారు. పత్తికొండ ప్రజల కల అయిన రోడ్ల విస్తరణ పూర్తికి తనవంతు సహకారం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పత్తికొండలో రహదారి విస్తరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పనులు పూర్తి అయితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడంతో పాటు పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. రహదారి విస్తరణ జరుగుతుందా లేదా అని ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పూర్తి చేస్తామన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రభుత్వాసుపత్రిలో వివిధ సదుపాయాల కల్పనపై కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆమె స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామపంచాయతీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో రహదారి విస్తరణ పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మోహన్‌దాసు, తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఎంపీడీఓ పార్థసారథి, సీఐ మురళీమోహన్, పీఆర్ డీఈఈ శేషయ్య, ఎంపీపీ నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

## బావిలో దూకి మహిళ ఆత్మహత్య



నాగేంద్రమ్మ(ఫైల్)

జూపాడుబంగ్లా: మైనర్ కూతురు ఇంట్లో చెప్పకుండా ప్రియునితో వెళ్లిపోయిందనే మనస్థాపంతో తల్లి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండ్లెం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు ఇవీ.. మండ్లెం గ్రామానికి చెందిన నాగశేషులు, నాగేంద్రమ్మ దంపతులకు నీలమ్మ, భారతి, శివకుమార్ సంతానం. వీరిలో రెండో కుమార్తె పదోతరగతి వరకు చదివి ఇంటివద్ద తల్లిదండ్రులకు చేదోడు, వాదోడుగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన శశికుమార్‌తో ప్రేమలో పడింది. మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ప్రియునితో వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న నాగేంద్రమ్మ గ్రామ సమీపంలోని మంగళి లక్ష్మీనారాయణ పొలంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త నాగశేషులు, బంధువులు బావిలో మోటార్లను అమర్చి నీటిని బయటకు తోడుతూ గాలించగా బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. తల్లి ఆత్మహత్య విషయం తెలుసుకున్న భారతి ప్రియునితో పాటు పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. అమ్మాయి వయస్సు 17 సంవత్సరాలు కాగా, అబ్బాయికి 20 ఏళ్లు. ఆత్మహత్య విషయం తెలిసి నందికొట్కూరు రూరల్ సీఐ, జూపాడుబంగ్లా ఎస్ఐ వెంకటసుబ్బయ్య, తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. మైనర్ అయిన తమ అమ్మాయిని ప్రేమ పేరుతో మోసగించి, ఆటోలో తీసుకెళ్లి పెళ్లి చేసుకున్న శశికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఎమ్మిగనూరురూరల్: డీలర్లు అనుమతిలేని విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. సుజాతమ్మ ఆధ్వర్యంలో సీడ్స్ విత్తన డీలర్లకు నిర్వహిస్తున్న 52 వారాల శిక్షణ కార్యక్రమానికి జేడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను డీలర్లు తప్పక పాటించాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలన్నారు. ఎంఆర్‌పీకే ఇవ్వాలని సూచించారు. 52 వారాల శిక్షణలో చెప్పే విషయాలను తప్పక అమలు చేయాలని తెలిపారు. ఆత్మ పీడీ శ్రీలత, ఏడీఏ మమహ్మద్‌ఖాద్రి, ఆత్మ ఏఓ మధుమతి, ఏడీఏ ఎఫ్‌టీసీ వెంకటేశ్వర్లు, వివిధ మండలాల డీలర్లు పాల్గొన్నారు.

## ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా శ్రీనివాసరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఏపీఎంఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె. శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఈఈగా వ్యవహరిస్తున్న ఈయనకు కర్నూలు ఈఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గతంలో ఈయన వైఎస్సార్ జిల్లా కడపలో రిమ్స్ హాస్పిటల్ నిర్మాణంలో ఈఈగా వ్యవహరించారు. ప్రస్తుతం కర్నూలు ఈఈగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి డీఈగా కొనసాగనుండడంతో కె. శ్రీనివాసరెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

## రేపటితో ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షల ముగింపు

కర్నూలు సిటీ: ఏపీఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ నెల 22, 23 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటు చేసిన 12 కేంద్రాల్లో ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఉదయం 1,047 మందికిగాను 984 మంది, మధ్యాహ్నం 1,047 మందికిగాను 1002 మంది, నంద్యాల జిల్లాలో ఉదయం 482 మందికిగాను 462 మంది, మధ్యాహ్నం 482 మంది విద్యార్థులకుగాను 462 మంది హాజరయ్యారు.

## ఆదోని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా రాజగోపాల్‌రావు

కర్నూలు(హాస్పిటల్): ఆదోని డివిజన్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా టి. రాజగోపాల్‌రావు నియమితులయ్యారు. విశాఖపట్టణానికి చెందిన ఈయన పలాసలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ కర్నూలు ఎఫ్ఎస్ఓగా బదిలీ అయ్యారు. గతంలో రామచంద్రాపురం, సుళ్లూరుపేట, పిఠాపురం, నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా, రాజమండ్రి డిప్యూటీ కమిషనర్‌గా కూడా ఈయన పనిచేశారు. యలమంచిలి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా 2005–07 వరకు విధులు నిర్వహించారు.

## డీఈఓ వెబ్‌సైట్‌లో తాత్కాలిక సీనియారిటీ జాబితా

కర్నూలు సిటీ: గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల తాత్కాలిక సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.deokrnl13.blogspot. com అనే వెబ్‌సైట్‌లో ఉన్న జాబితాలో 2006 డీఎస్సీ వరకు స్కూల్ అసిస్టెంట్, తత్సమాన హోదాతో నియామకం, పదోన్నతి పొంది అర్హత గత వారి పేర్లను నమోదు చేశామన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4.30 గంటలలోపు తగిన ఆధారాలతో హెచ్ఎం, ఎంఈఓల ద్వారా డీఈఓ కార్యాలయానికి అందజేయాలన్నారు.

## టీఐఎస్ఎస్‌లో సీటు సాధించిన తొగురు సిరి సింధూర



తొగూరు సిరి సింధూర

కర్నూలు కల్చరల్: ముంబైలోని ప్రఖ్యాత టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్)లోని స్కూల్ ఆఫ్ మేనేజ్ మెంట్ అండ్ లేబర్ స్టడీస్ వారి హ్యూమన్ రీసోర్సెస్ మేనేజ్‌మెంట్ అండ్ లేబర్ రిలేషన్స్ (హెచ్ఆర్ఎంఎల్ఆర్)లో జిల్లాకు చెందిన తొగురు సిరి సింధూర సీటు సాధించారు. 1936లో స్థాపింపచబడిన టీఐఎస్ఎస్ ఆసియాలోనే సామాజిక స్పృహ (సోషల్ సెన్సిటివిటి)తో కూడిన ప్రొఫెషనల్ కోర్సెస్ అందించే ఉన్నత విశ్వవిద్యాలయం. ప్రతి సంవత్సరం 40 వేల మంది టీఐఎస్ఎస్‌లోని నాలుగు క్యాంపస్‌ల్లో చేరడానికి దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో కేవలం 68 మంది మాత్రమే హెచ్ఆర్ఎంఎల్ఆర్ ప్రోగ్రాంకు ఎంపికవుతారు. ఇందులో జిల్లాకు చెందిన సిరి సింధూర ఎంపిక కావడం గర్వకారణం. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కుమార్తె అయిన ఈమె కర్నూలు ఎన్నార్ పేట సెయింట్ జోషఫ్ పాఠశాలలో పాఠశాల విద్య, హైదరాబాద్ కూకట్ పల్లి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. 2015లో ఐఐటీ గౌహతిలో బీఈ (బ్యాచిలర్ ఆఫ్ డిజైన్) పూర్తి చేశారు. ఇగ్నోలో ఎంఏ సోషియాలజీ పూర్తి చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న సిరి సింధూర టీఐఎస్ఎస్‌కు ఎంపిక కావడంపై ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 21 నుంచి 23 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే 10 వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికైంది. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జట్టు వివరాలను పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి వేణుగోపాల్ వెల్లడించారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో యశ్వంత్, శివాజీ, చంద్ర, శభాష్, విజయ్‌కుమార్, రాజు, బాలికల సబ్ జూనియర్ విభాగంలో సాహితీ, దీప్తి, సంగీత, జూనియర్స్ బాలుర విభాగంలో లక్ష్మీనరసింహ, హేమంత్, మహేష్, రోహిత్, బాలికల విభాగంలో పల్లవి ఎంపికయినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ పిలుపునిచ్చారు కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ ఉపాధ్యక్షులు రాంగోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 19 రోజుల ఉపాధ్యాయుడు

1998 డీఎస్సీలో నియామకం

- జూన్ 30న పదవీ విరమణ



దేవనకొండ ఎంఈఓ రంగస్వామికి జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న వివేకశాస్త్రి

ఆలూరు/దేవనకొండ: ఉపాధ్యాయునిగా పని చేయాలనే తన కల నెరవేరడం పట్ల ఓ వ్యక్తి సంతోషపడుతుండగా.. త్వరలోనే పదవీ విరమణ ఉండటం ఒకింత నిరాశకు గురి చేస్తోంది. డోన్ పట్టణానికి చెందిన వివేకశాస్త్రి 1998 డీఎస్సీలో క్వాలిఫై అయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీరికి ఉద్యోగం కల్పించడంతో వివేకశాస్త్రి కూడా ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఆ మేరకు బుధవారం ఆయన దేవనకొండ ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ రంగస్వామికి తన జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో వచ్చే నెల జూన్ 12న కె.వెంకటాపురం గ్రామంలో ఆయన విధుల్లో చేరనున్నారు. అయితే ఇతని వయస్సు జూన్ 30 నాటికి 60 సంవత్సరాలు పూర్తి కానుండటంతో 19 రోజుల పాటు ఉపాధ్యాయునిగా కొనసాగనున్నారు. వీరికి బేసిక్ పే స్కేలు రూ.32,470 కాగా.. 18, 25వ తేదీలు పాఠశాలలకు సెలవు దినాలు. ఈ లెక్కన రూ.20,564 వేతనంతో వివేకశాస్త్రి పదవీ విరమణ పొందనుండటం విశేషం. ఏదేమైనా ఉపాధ్యాయునిగా పనిచేయాలనే తన కల నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు ముమ్మరం చేయండి



కోసిగిలో ఇళ్ల నిర్మాణాల రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు

కోసిగి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజు నాయుడు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కోసిగిలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పరిశీలించారు.తర్వాత పురోగతిపై అధికారులతో సమీక్షించారు. కోసిగి మండలంలోని 1,229 జగనన్న కాలనీల్లో 783 ఇళ్లు గ్రౌండింగ్ కాగా, 52 ఇళ్లు పూర్తి గా నిర్మించినట్లు హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు వెల్లడించారు. మిగిలిన ఇళ్లు వివిధ దశలో ఉన్నట్లు చెప్పారు. స్థలం మంజూరై ఇంటిని నిర్మించుకోలేని వారికి అవగాహన కల్పించి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. అనంతరం సజ్జలగుడ్డం గ్రామంలో నిరుపయోగంగా మారిన సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. పొడి, తడి చెత్త నుంచి సంపద సృష్టించాలని ఈఓపీఆర్డి అరూన్ రషీద్‌కు ఆదేశించారు. తర్వాత కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయం, సచివాలయం 1,2,5ను తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. అలాగే ఇంటి, నీటి పన్ను వసూళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాహితి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ సేవలో శ్రీమఠం పీఠాధిపతి

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టుచీర, పూలు, పండ్లు సమర్పించారు. ఆలయ వేద పండితులు వేదస్వస్తి పలకగా, చైర్మన్, ఈఓ అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు నంబూరి రవి, దేవిశెట్టి బాలకృష్ణ, బచ్చు మాధవీకృష్ణ, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.